# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ దేశాన్ని ఆత్మనిర్భర్, వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో రానున్న రెండు దశాబ్దాలు అత్యంత కీలకమని ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ తెలిపారు.

❖ హౌరా–గువాహటి మధ్య నడిచే మొట్టమొదటి "వందే భారత్ స్లీపర్" రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించారు.

❖ భారత్, కెనడా మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని పటిష్ఠం చేసేందుకుగాను కేంద్రమంత్రి పీయూష్ గోయల్ కెనడాలోని బ్రిటీష్ కొలంబియా ప్రీమియర్ డేవిడ్ ఎబీతో భేటీ అయ్యారు.

❖ దేశంలోని వాయువ్య, తూర్పు రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు మరికొన్ని రోజుల్లో మారనున్నాయని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశాన్ని ఆత్మనిర్భర్, వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో రానున్న రెండు దశాబ్దాలు అత్యంత కీలకమని ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ తెలిపారు. ఈ ప్రస్థానంలో ఉత్తరాఖండ్ రాష్ట్రం ప్రత్యేక పాత్ర పోషిస్తుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. డెహ్రాడూన్‌లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... పునరుత్పాదక ఇంధనం, సేంద్రియ వ్యవసాయం, ఆయుష్, పర్యాటకం వంటి రంగాల్లో ఉత్తరాఖండ్‌కు అపారమైన సామర్థ్యం ఉందని అన్నారు. వీటితో పాటు అంకుర సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లోనూ రాష్ట్రం ముందంజలో ఉందని ప్రశంసించారు. రాష్ట్రంలోని ఈ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటే జాతీయ వృద్ధికి అది గొప్ప ఊతాన్నిస్తుందని తెలియజేస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

హౌరా–గువాహటి మధ్య నడిచే దేశంలోనే మొట్టమొదటి `వందే భారత్ స్లీపర్` రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ లోని మాల్దా టౌన్ రైల్వే స్టేషన్‌లో ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. తిరుగు ప్రయాణంలో గువహటి -

హౌరా వందే భారత్ స్లీపర్ సర్వీసును ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.... పూర్తిగా ఏసీ సౌకర్యం ఉన్న ఈ స్లీపర్ రైలు, తక్కువ ధరలోనే విమాన ప్రయాణానికి సమానమైన అనుభూతిని అందిస్తుందని తెలిపారు. దీని వల్ల సుదూర ప్రాంతాల ప్రయాణం మరింత వేగంగా, సురక్షితంగా మారుతుందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్డా వేదికగా సుమారు 3 వేల 250 కోట్ల రూపాయల విలువైన పలు రహదారి, రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆయన ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. మాల్డా ప్రాంతంలోని మామిడి, పట్టు పరిశ్రమల అభివృద్ధికి అండగా వుంటామని హామీ ఇచ్చారు. పశ్చిమ బెంగాల్ లో అక్రమ చొరబాట్లు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని, దీనివల్ల స్థానిక జనాభా నిష్పత్తి మారిపోవడమే కాకుండా స్థానిక భాషలకు కూడా ముప్పు పొంచి ఉందని ప్రధానమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 29 వరకు రాష్ట్రపతి భవన్ (సర్క్యూట్-1) సందర్శనను నిలిపివేస్తున్నట్లు రాష్ట్రపతి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాజ్ పథ్‌లో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్, బీటింగ్ రిట్రీట్ వేడుకల ఏర్పాట్ల దృష్ట్యా ప్రజలకు అనుమతి ఉండదని స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజాస్వామ్య సంస్థలు పారదర్శకంగా, సమగ్రంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసినప్పుడే అవి బలోపేతం అవుతాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో మూడు రోజుల పాటు జరిగిన `కామన్వెల్త్ దేశాల స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారుల సదస్సు` (CSPOC) ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. 56 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ సదస్సు లక్ష్యాలను గుర్తు చేస్తూ... కామన్వెల్త్ దేశాల శాసనసభల మధ్య నిరంతర చర్చలు, పార్లమెంటరీ సామర్థ్యాన్ని పెంచే మార్గాలను అన్వేషించడమే దీని ప్రధాన ఉద్దేశమని ఓం బిర్లా పేర్కొన్నారు. అనంతరం 29వ సదస్సు అధ్యక్ష బాధ్యతలను బ్రిటన్ హౌస్ ఆఫ్ కామన్స్ స్పీకర్ సర్ లిండ్సే హోయిల్‌కు ఆయన అప్పగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, కెనడా దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకుగాను కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కెనడాలోని బ్రిటీష్ కొలంబియా ప్రీమియర్ డేవిడ్ ఎబీతో ఈరోజు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల వృద్ధిపై చర్చించినట్లు కేంద్రమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (MSME) హిమాచల్‌ప్రదేశ్‌లోని ఉనా జిల్లా పాండోగా, సోలన్ జిల్లా పార్వానూలో టెక్నాలజీ సెంటర్ల స్థాపనకు ఆమోదం తెలిపింది. ఒక్కో కేంద్రం సుమారు 10 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు కానుంది. పాండోగా, పార్వానూ కేంద్రాలు దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 13 కొత్త టెక్నాలజీ

సెంటర్లలో భాగంగా ఎంపికయ్యాయి. ఈ కేంద్రాలు రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధికి కొత్త దిశ చూపనున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించి `ఫామ్-7` (Form-7) పై తృణమూల్ కాంగ్రెస్ (TMC), బీజేపీ (BJP) మధ్య పరస్పర ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. ఒక నిర్దిష్ట నియోజకవర్గానికి చెందిన ఏ ఓటరైనా ఎన్ని దరఖాస్తులనైనా సమర్పించవచ్చని, దీనిపై ఎటువంటి పరిమితి లేదని ఈసీ స్పష్టం చేసింది. అయితే.. ఈ ప్రక్రియ దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ఎన్నికల సంఘం ఒక కీలక నిబంధనను అమలు చేస్తోంది. ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువ అభ్యంతరాలను (ఫామ్-7) దాఖలు చేస్తే, వాటిని సంబంధిత ఓటరు నమోదు అధికారి (ERO) క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఈ అభ్యంతరాలు సరైనవేనా లేదా అని నిర్ధారించుకున్న తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటారని ఈసీ వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతరిక్ష పరిశోధనల పట్ల విద్యార్థులలో ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో దేశ రాజధానిలో ఏర్పాటు చేసిన వర్చువల్ రియాలిటీ థియేటర్ "ఫ్రమ్ ఎర్త్ టు ఆర్బిట్" ఎగ్జిబిషన్‌ను గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆక్సియమ్–4 మిషన్‌లో పాల్గొన్న అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. భవిష్యత్ అంతరిక్ష అన్వేషణలో యువత కీలక పాత్ర నిర్వహిస్తుందని శుభాన్షు శుక్లా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాం చేరుకున్నారు. ఈరోజు సాయంత్రం గువహటి విమానాశ్రయం నుంచి అజారా వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర నిర్వహించిన రోడ్ షోలో ప్రధానమంత్రి పాల్గొన్నారు. అనంతరం గువహటిలోని అర్జున్ భోగేశ్వర్ బారువా క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న బోడో సాంప్రదాయ సాంస్కృతిక వేడుక `బగురుంబా ద్వౌ -2026` లో పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. వీటితో పాటు రెండు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆయన జెండా ఊపి ప్రారంభించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా 2024-25 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఎరువులను అందుబాటులో వుంచింది. దేశంలో సుమారు 152.50 కోట్ల బస్తాల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేయగా.. అంతకంటే అధికంగా 176.79 కోట్ల బస్తాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఇది అన్నదాతల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని కేంద్ర రసాయన, ఎరువుల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రభుత్వ తీసుకున్న ఈ ముందస్తు చర్యల వల్ల దేశంలోని ఏ ప్రాంతంలోనూ ఎరువుల కొరత తలెత్తలేదని అధికారులు స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని వాయువ్య, తూర్పు రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు మరికొన్ని రోజుల్లో మారనున్నాయని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. ప్రస్తుతం తీవ్రమైన చలిగాలులు, దట్టమైన పొగమంచుతో కూడిన పలు ప్రాంతాలకు త్వరలో ఉపశమనం లభించనుందని పేర్కొంది. ఈ నెలాఖరు నాటికి మైదాన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకుంటాయని, ఇదే సమయంలో ఉత్తరాది పర్వత ప్రాంతాల్లో భారీగా హిమపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. వాతావరణంలో చోటు చేసుకుంటున్న ఈ మార్పుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మోటెగి ఈరోజు ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. తొలుత సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్‌కు చేరుకున్న జపాన్ ప్రతినిధి బృందానికి.. ఢిల్లీ మెట్రో ప్రాజెక్టు విశేషాలను డీఎంఆర్‌సీ (DMRC) ఉన్నతాధికారులు వివరించారు. మెట్రో నిర్మాణ పద్ధతులు, నిర్వహణ తీరుపై మోటెగి ప్రత్యేక ఆసక్తి కనబరిచినట్లు డీఎంఆర్‌సీ సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = =